తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
శుక్రవారం
16 అక్టోబర్ 2026
పేజీలు : 8
Follow :

# నిజామాబాద్ కాంగ్రెస్‌లో పదవుల పంచాయితీ!




- ఏఎంసీ పీఠంపై యాదగిరి.. డీసీసీబీ రేసులో రమేష్‌రెడ్డి
- వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవులపైనా ఆశావహుల గురి
- కార్యకర్తలకు ప్రాధాన్యం దక్కేనా?

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15 (జనంసాక్షి): నామినేటెడ్ పదవుల భర్తీ నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో రాజకీయ వేడిని పెంచుతోంది. మార్కెట్ కమిటీ నుంచి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వరకు కీలక పదవులను దక్కించుకునేందుకు ఆశా వహులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవికి కేతావత్ యాదగిరి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ పదవికి కుంట రమేష్‌రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరికి ముఖ్య నేతల మద్దతు ఉందన్న ప్రచారంతో పాటు వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవుల కోసం కూడా పోటీ నెలకొంది. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు

వార్తా లోపలి పేజీలో



## ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్స్ పోటీలకు ఆహ్వానం

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**గోదావరిఖని, జనంసాక్షి :** పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్ల కోసం ఫోటోగ్రఫీ మరియు షార్ట్ ఫిలిమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో, సమాజ రక్షణలో విధి నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన అమర పోలీసుల సేవలు, త్యాగాలను స్మరించుకుంటూ అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసుల త్యాగాలు, సేవలు, విధి నిర్వహణలో వారి ప్రతిభను ప్రతిబింబించే విధంగా ఫోటోలు, షార్ట్ ఫిలిమ్స్ రూపొందించాలని సూచించారు. ఆసక్తి గల వారు పోలీసులకు సంబంధించిన అంశాలపై తీసిన మూడు ఫోటోలు మరియు మూడు నిమిషాలకు మించని ఒక షార్ట్ ఫిలింను ఈ నెల 23వ తేదీ సాయంత్రంలోగా రామగుండం పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ (ఔ ఎన్‌ఐబి) కార్యాలయంలో సమర్పించాలి. ఫోటోలు 10 x 8 అంగుళాల పరిమాణంలో ఉండాలి. షార్ట్ ఫిలింను పెన్‌డ్రైవ్‌లో పూర్తి వ్యక్తిగత వివరాలతో సమర్పించాలి. కమిషనరేట్ స్థాయిలో ఎంపికైన మూడు ఉత్తమ ఫోటోలు, మూడు ఉత్తమ షార్ట్ ఫిలిమ్స్‌ను రాష్ట్రస్థాయి పోటీలకు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి పంపించనున్నట్లు సీపీ తెలిపారు. యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీసుల సేవలు, త్యాగాలను సమాజానికి చాటిచెప్పే విధంగా తమ ప్రతిభను ప్రదర్శించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు.

## కులం పేరుతో దూషించి హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు?

**సాక్షా ఆధారాలతో నిందితుడికి శిక్ష**

**పెద్దకొడపగల్ హత్య కేసులో నిందితుడికి రూ.1,000 జరిమానా..**

**పకడ్బందీ దర్యాప్తుతో శిక్ష పడేలా చేసిన పోలీసులను అభినందించిన ఎస్పీ రాజేష్ చంద్ర**

కామారెడ్డి, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (జనంసాక్షి) కులం పేరుతో దూషిస్తూ ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో మిగతా 2లో



## కలంపై పోలీసుల జులుం తగదు

వార్తా లోపలి పేజీలో

## క్రికెట్ శిక్షణతో పాటు సాంస్కృతిక అనుభవాలు

**కరీంనగర్‌లో నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న హెచ్‌సీఏ మహిళా క్రికెటర్లు**

**కరీంనగర్ కల్చరల్, అక్టోబర్ 15, ( జనంసాక్షి)** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న తొమ్మిది రోజుల మహిళా క్రికెటర్ల ప్రత్యేక రెసిడెన్షియల్ కోచింగ్ క్యాంపులో భాగంగా, తెలంగాణలోని నాలుగు జిల్లాలకు చెందిన మహిళా క్రికెటర్లు కరీంనగర్‌లోని శక్తి ఆలయాన్ని సందర్శించి, నవరాత్రి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కరీంనగర్‌లోని అలుగునూరులో ఉన్న వీఆర్‌జేఆర్ క్రికెట్ గ్రౌండ్ & అకాడమిలో ఈ కోచింగ్ శిబిరం నిర్వహించబడుతోంది. క్రికెట్‌లో సమగ్ర శిక్షణ పొందుతున్న క్రీడాకారిణులకు ఈ ఆలయ సందర్శన ద్వారా ప్రాంతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలను తెలుసుకునే అవకాశం లభించింది. ఈ సందర్భంగా మహిళా క్రికెటర్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ



బండి సంజయ్ కుమార్‌ను కూడా కలిసి, ఆయనతో ముచ్చటించారు. నాణ్యమైన క్రికెట్ శిక్షణతో పాటు సాంస్కృతిక అనుభవాలు, వ్యక్తిగత వికాసానికి అవకాశాలు కల్పించడం ద్వారా మహిళా క్రికెటర్ల సమగ్ర అభివృద్ధికి కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కట్టుబడి ఉందని ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తోంది.

## విదేశీ ఉద్యోగ వీసా పేరుతో మోసం..

**○నిందితుడు అరెస్ట్ ఆర్మూర్ కోర్టులో హాజరు.. ○రిమాండ్‌కు తరలింపు**

**ఆర్మూర్ (జనంసాక్షి):** విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి పలువురు నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడిని జక్రాన్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఉమ్మెడి అంజయ్య అలియాస్ అనిల్‌ను గురువారం ఆర్మూర్‌లోని గౌరవ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన ఆకుల మహేష్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అజర్‌బైజాన్ దేశంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఫిర్యాదుదారుడి నుంచి ఫోన్‌పే, నగదు రూపంలో మొత్తం రూ. 2.80 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, హామీ ఇచ్చిన విధంగా ఉద్యోగ వీసా ఇప్పించకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఇదే విధంగా మరో ఐదుగురి నుంచి కూడా ఒక్కొక్కరి వద్ద రూ. 2.80 లక్షల చొప్పున వసూలు చేసినట్లు ఫిర్యాదులో




పేర్కొన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

విదేశీ ఉద్యోగాల పేరుతో మోసపోవద్దు

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఏజెంట్లు ఇచ్చే హామీలను గుడ్డిగా నమ్మవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. డబ్బులు చెల్లించే ముందు ఏజెంట్ రిజిస్ట్రేషన్, ఉద్యోగ వివరాలు, వీసా పత్రాలను సంబంధిత అధికారుల ద్వారా ధ్రువీకరించుకోవాలని కోరారు. ఎవరైనా విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడితే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

# కులం పేరుతో దూషించి హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు?

పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ నిజామాబాద్ రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి (ఎస్సీ/ఎస్టీ కోర్టు) ఎస్. నారాయణ తీర్పు వెలువరించారు. పెద్దకొడపగల్ గ్రామంలో 2023 నవంబర్‌లో జరిగినఈహత కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయస్థానం ఈ శిక్ష విధించింది.

**డబ్బుల వివాదమే హత్యకు కారణం**

పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దకొడపగల్ గ్రామానికి చెందిన కారాడి సాయికుమార్ (25), బసవరాజ్ అలియాస్ బసవయ్య తరచూ కలిసి తిరిగేవారు. నిందితుడు స్థలం విక్రయించగా వచ్చిన రూ.25 లక్షల విషయమై ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. తనకు డబ్బులు ఇవ్వాలని బసవయ్య అడగడంతో, అతడిని వదిలించుకోవాలనే ఉద్దేశంతో సాయికుమార్ హత్యకు పథకం వేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

**మద్యం తాగించి.. కులం పేరుతో దూషిస్తూ హత్య**

2023 నవంబర్ 25న కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లో విందు ఇస్తానని బసవయ్యను పిలిచిన నిందితుడు అతడికి అధికంగా మద్యం తాగించాడు. అర్ధరాత్రి సమయంలో డబ్బుల విషయమై ఇద్దరి మధ్య గొడవ జరగడంతో కులం పేరుతో దూషిస్తూ కర్రతో తలపై కొట్టాడు. అనంతరం కొబ్బరి తాడుతో మెడకు బిగించి, కాళ్లు కట్టి నిర్మాణంలో ఉన్న ఇంటి ఆవరణలోని సెప్టిక్ ట్యాంకులో పడవేసి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

**సాక్ష్యాధారాలతో నిందితుడికి శిక్ష**

2023 నవంబర్ 25న ఇంటి నుంచి వెళ్లిన బసవరాజ్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. మూడు రోజుల తర్వాత నిందితుడి నిర్మాణంలో ఉన్న ఇంటి ఆవరణలోని సెప్టిక్ ట్యాంకులో కాళ్లకు తాడు కట్టి ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యురాలు మెట్టు మీది పాపవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెద్దకొడపగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యులు, కాలనీవాసులు, చుట్టుపక్కల వారిని విచారించి కీలక సాక్ష్యాధారాలు సేకరించిన పోలీసులు కారాడి సాయికుమార్, తండ్రి అంజయ్యను అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయస్థానం నిందితుడికి జీవిత ఖైదు, రూ.1,000 జరిమానా విధించింది.

**పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర మాట్లాడుతూ నేరం ఎంత చాకచక్యంగా చేసినా చట్టం ముందు, సాక్ష్యాధారాల ముందు దోషులు తప్పించుకోలేరని స్పష్టం చేశారు. ఈ కేసులో పకడ్బందీగా దర్యాప్తు నిర్వహించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి డీఎస్పీ కె. జగన్నాథ్ రెడ్డి, ప్రస్తుత బాన్సువాడ డీఎస్పీ పి. విఠల్ రెడ్డి, పెద్దకొడపగల్ ఎస్‌హెచ్‌ఓ జి. అరుణ్ కుమార్, కోర్టు లైజనింగ్ అధికారులు ఏఎస్ఐ రాజేశ్వర్, శ్రీనివాస్, సీడీఓ జి. రవిచంద్ర గౌడ్‌తో పాటు కోర్టులో వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.దయాకర్‌గౌడ్‌లనుప్రత్యేకంగా అభినందించారు.



# అనంతుల రాజుకు కోలేటి దామోదర్, ఏసీపీ మడత రమేష్ ఘన సన్మానం

**యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి)అక్టోబర్ 15:**
తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన అనంతుల రాజును తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గురువారం తన నివాసంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా, రామగుండం పోలీస్ కమిషనరేట్ ఏసీపీ మడత రమేష్ తన చాంబర్‌లో అనంతుల రాజును శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కోలేటి దామోదర్, ఏసీపీ మడత రమేష్ అనంతుల రాజు రాష్ట్రస్థాయి ఉపాధ్యక్షుడిగా నియమితులు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయన నియామకం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతుల రాజు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లయన్స్ క్లబ్ నాయకులు కోలేటి శ్రీనివాస్, గోదావరిఖని పట్టణ అధ్యక్షుడు వెనిశెట్టి నటరాజశేఖర్, తెలంగాణ ఆర్యవైశ్య విద్యావంతుల వేదిక వ్యవస్థాపకుడు బల్లు చంద్రప్రకాష్, వెనిశెట్టి వీరన్న, వెంకట ముత్యం, సంతోష్, ముస్త్యాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన డా. బోగ శ్రావణిప్రవీణ్

**రాయికల్ అక్టోబర్ జనం సాక్షి :**

దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని, ఆధ్యాత్మిక భక్తిభావాన్ని పెంపొందించడం, ప్రజల్లో భక్తి, ఐక్యత, సాంస్కృతిక సంప్రదాయాల పట్ల గౌరవాన్ని చాటడం లక్ష్యంగా బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డా. బోగ శ్రావణి ప్రవీణ్ గురువారం రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన పలు దుర్గాదేవి మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, జగిత్యాల నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, సమాజంలో ఐకమత్యం, సోదరభావం బలోపేతం కావడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షులు కుర్మా మల్లారెడ్డి, రాయికల్ మండల అధ్యక్షులు ఆకుల మహేష్, స్థానిక కౌన్సిలర్లు కల్లెడ ధర్మపురి, పురే శ్రీధర్, ప్రశాంత్, రాము, బన్న సంజీవ్, సమల్ల సతీష్‌తో పాటు పట్టణ ముఖ్య నాయకులు, బీజేపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామస్తులు సర్వే అధికారులకు సహకరించాలి ఎమ్మార్వో ఎండి ఫారుక్

**ముస్తాబాద్ అక్టోబర్ 15( జనం సాక్షి)**
ముస్తాబాద్ మండల కేంద్రంలో మొర్రాపూర్ గ్రామాలలో గ్రామ సర్పంచ్ బుక్య రాజు నాయక్ ఆధ్వర్యంలో భూములరి సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తాసిల్దార్ ఎండి ఫారుక్ రెవెన్యూ శాఖ అధికారులకు మాట్లాడుతూ గ్రామంలో 904,32 ఎకరాల గుంటల భూమి సర్వే చేస్తున్నారు.159 సర్వే నెంబర్లలో ఉన్నట్టు వంటి భూమి హద్దులు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిపిఓ రాజు. సర్వే అధికారి చంద్రమోహన్. విజయ్ శ్రీకాంత్. నర్సింలు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం పోరాటం.. న్యాయం కోసం నిరీక్షణ

## కాంగ్రెస్ కార్యకర్త పసుల వెంకటి ఆవేదన

**ఇల్లంతకుంట, అక్టోబర్ 15 (జనంసాక్షి):**
2014 నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం పోరాడుతున్న తనకు పార్టీ కార్యాలయ మెట్ల కంటే కోర్టు మెట్లపైనే అడుగులు ఎక్కువగా పడ్డాయని కాంగ్రెస్ కార్యకర్త పసుల వెంకటి ఆవేదన వ్యక్తం చేశారు. 2026 ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు పలు తేదీల్లో కోర్టుకు హాజరైనట్లు తెలిపారు.
పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తించి ఆదుకోవాల్సిన అవసరం ఉందని, కష్టకాలంలో అండగా నిలిచిన వారిని విస్మరించరాదని అన్నారు. పదవుల కోసం కాకుండా తన నమ్మకం, సిద్ధాంతాల కోసం పోరాడుతున్నానని స్పష్టం చేశారు. తనపై ఉన్న కేసులను ప్రభుత్వం పరిశీలించి, అక్రమంగా నమోదైన కేసులుంటే చట్ట ప్రకారం తొలగించాలని కోరారు. "నన్ను గుర్తించకపోయినా పరవాలేదు.. నేను మారను. ఎందుకంటే నేను కార్యకర్తను, అవకాశం కాదు" అని పసుల వెంకటి పేర్కొన్నారు.

# జర్నలిస్టులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి..

**- టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా దాడుల వ్యతిరేక కమిటీ కో- కన్వీనర్ సురభి శ్రీధర్..**



**గోదావరిఖని, జనంసాక్షి :**
వార్తా కథనాలు ప్రచురించినందుకు 'ఏక్ దమ్ న్యూస్' జర్నలిస్టులు సంపత్, ఎడిటర్ పొత్తూరి శేఖర్‌పై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరిపించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మల్లావర్జుల వంశీవిద్యానంద్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు పి. విజయ్ కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోల లక్ష్మణ్, టికె శ్రీనివాస్, రాష్ట్ర మఫిషియల్ కమిటీ సభ్యుడు సామల హరికృష్ణ, దాడుల వ్యతిరేక కమిటీ జిల్లా కన్వీనర్ చింతకింది చంద్రమొగిలి, కో కన్వీనర్ సురభి శ్రీధర్, జిల్లా ఎథిక్స్ కమిటీ కన్వీనర్ పోతరాజు సమ్మయ్య డిమాండ్ చేశారు. బాధ్యులైన గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్‌తోపాటు సంబంధిత పోలీసులను సస్పెండ్ చేసి, క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్ లో సీసీ కెమెరాల దృశ్యాలు, అరెస్టు రికార్డులు, వైద్య నివేదికలు సహా కీలక ఆధారాలను భద్రపరచాలని కోరారు. బాధితులకు రక్షణ కల్పించి, వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రభుత్వం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



# 28వ డివిజన్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

## మహిళలకు బహుమతులు.. మున్సిపల్ కార్మికులకు ఘన సన్మానం

**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 15, ( జనం సాక్షి)**
కరీంనగర్ నగరంలోని 28వ డివిజన్‌లో కార్పొరేటర్ భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. డివిజన్‌కు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ప్రదర్శిస్తూ పండుగ సందడిని నెలకొల్పారు. బతుకమ్మ పండుగ ఏడు రోజుల విశిష్టతను చాటుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందంగా అలంకరించిన బతుకమ్మలకు నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.5,000, రెండో బహుమతిగా రూ.4,000, మూడో బహుమతిగా రూ.3,000, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన బతుకమ్మలకు రూ.2,000 చొప్పున బహుమతులు ప్రకటించారు. వీటితోపాటు ఇతర మహిళలను ప్రోత్సహించేందుకు కన్సొలేషన్ బహుమతులు కూడా అందజేశారు. కార్యక్రమంలో భాగంగా డివిజన్‌కు చెందిన మహిళలు, పురుషులను ప్రత్యేకంగా సన్మానించారు. ప్రజలకు సేవలందిస్తున్న డివిజన్‌లోని మున్సిపల్ కార్మికులను శాలువాలతో సత్కరించి వారి సేవలను గుర్తించారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలను ప్రోత్సహిస్తూ, డివిజన్ ప్రజలను భాగస్వాములను చేస్తూ ఈ వేడుకలను నిర్వహించడంపై పలువురు కార్పొరేటర్ భాస్కర్ నాయక్‌ను అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, కరీంనగర్ అర్బన్ డీసీసీ అధ్యక్షుడు వైద్యుల అంజనీకుమార్ హాజరయ్యారు. పలువురు కార్పొరేటర్లు, డివిజన్ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.



# నిజామాబాద్ కాంగ్రెస్‌లో పదవుల పంచాయితీ!

ఈసారి అవకాశాలు దక్కుతాయా? అన్న చర్చ కాంగ్రెస్ శ్రేణుల్లో సాగుతోంది.

**ఏఎంసీ చైర్మన్ రేసులో యాదగిరి**

నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి కేతావత్ యాదగిరి పేరు బలంగా ప్రచారంలో ఉంది. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి మద్దతు ఆయనకు ఉందన్న ప్రచారం ఈ అంచనాలకు బలాన్నిస్తోంది. దీంతో పదవిని ఆశిస్తున్న ఇతర నాయకులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. అయితే పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించే వరకు తుది నిర్ణయంపై స్పష్టత రానుంది.చైర్మన్ పదవితో పాటు వైస్ చైర్మన్, డైరెక్టర్ స్థానాలపైనా ఆశావహులు దృష్టి సారించారు. ఎన్నికల సమయంలో పార్టీకి అండగా నిలిచినవారు, కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని క్షేత్రస్థాయి నాయకులు కోరుతున్నారు. మరోవైపు నేతల సిఫారసులు, సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం పదవుల కేటాయింపులో కీలకం కానున్నాయి.

**డీసీసీబీ పీఠంపై రమేష్‌రెడ్డి ఆశలు**

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గం కూర్పుపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారించడంతో చైర్మన్ పదవిపై ఉత్కంఠ పెరిగింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షుల ఎంపిక పూర్తికావడంతో డీసీసీబీ చైర్మన్ ఎన్నికలో ప్రతినిధుల మద్దతు కీలకంగా మారనుంది.

ఈ నేపథ్యంలో కుంట రమేష్‌రెడ్డి పేరు ప్రధానంగా వినిపిస్తోంది. బోధన్ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు సుదర్శన్‌రెడ్డి మద్దతు ఆయనకు ఉందన్న ప్రచారం సాగుతోంది. సహకార సంఘాల ప్రతినిధులతో సంబంధాలు, వారి మద్దతు సమీకరణాలు చైర్మన్ ఎంపికను ప్రభావితం చేయనున్నాయి. డైరెక్టర్ల బోర్డులో ఎవరికి అవకాశం కల్పిస్తారన్న అంశంపైనా ఆసక్తి నెలకొంది.

**కార్యకర్తలకు న్యాయం జరిగేనా?**

ఏఎంసీ, డీసీసీబీ పదవుల కేటాయింపు జిల్లా కాంగ్రెస్‌లో నేతల రాజకీయ బలాబలాలకు పరీక్షగా మారుతోంది. కీలక పదవులతో పాటు ఇతర




స్థానాలను ఎవరికి కేటాయిస్తారన్నది పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా ఉంది. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఇస్తారా? లేక కీలక నేతల అనుచరులకే ప్రాధాన్యం దక్కుతుందా? అన్నది తేలాల్సి ఉంది.ప్రస్తుతం ఏఎంసీ చైర్మన్ పదవికి యాదగిరి, డీసీసీబీ చైర్మన్ పదవికి రమేష్‌రెడ్డి పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. చైర్మన్ పదవులతో పాటు వైస్ చైర్మన్, డైరెక్టర్ స్థానాల కేటాయింపుతోనే జిల్లా కాంగ్రెస్‌లో పదవుల పంచాయితీకి తెరపడనుంది.



## దుర్గామాత పూజ లో పాల్గొన్న:జిఎంలు

రామగిరి జనం సాక్షి అక్టోబర్ 15:

సింగరేణి అడ్రియాల లాంగ్ వాల్ గని నందు దుర్గామాత శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా గురువారం చండీ హోమం, మహా ప్రసాద వితరణ, బోనాల కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమానికి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, వెంకట లక్ష్మి దంపతులు పాల్గొని దుర్గామాత కు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నిర్వహించిన మహా ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.కార్యక్రమంలో గుర్తింపు , ప్రాతినిధ్య సంఘాల నాయకులు కొరిమి రాజ్ కుమార్, యం.రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎస్వోటుజిఎం యం.రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ దూప్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.జనార్ధన్, మేనేజర్ పెంచలయ్య తో పాటు ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, పిట్ కార్యదర్శులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తాం:వొడితల ప్రణవ్

- **ప్రజా ప్రభుత్వంలో ప్రతి లబ్ధిదారున్ని ఆదుకుంటాం..**
- **జమ్మికుంట మండలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేసిన ప్రణవ్..**

**జమ్మికుంట,అక్టోబర్ 15 (జనంసాక్షి):**

కష్ట సమయంలో పేదవారికి అండగా నిలిచి వారికి మేమున్నామనే భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.గురువారం రోజున మన ఊరు-మన కాంగ్రెస్-మన ప్రణవ్ కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట మండల పరిధిలోని మాచనపల్లి, జగ్గయ్యపల్లి, కోరపల్లి, విలాసాగర్, నగురం, వావిలాల, నాగంపేట, శాయంపేట, మడిపల్లి గ్రామాల్లో 8 లక్షల విలువ చేసే 17 చెక్కులను నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. పరిస్థితి బాగోలేక ఆసుపత్రులపాలైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా ఆదుకుంటున్నామని, గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు వివిధ సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని వాటిని పరిష్క రించడానికి కృషి చేస్తున్నా మని అన్నారు.ఈ సందర్భం గా కష్ట సమయంలో అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఇంచార్జి ప్రణవ్ బాబుకు లబ్ధిదారులు కృతజ్ఞత లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,మండల అధ్యక్షుడు, పట్టణ అధ్యక్షుడు, ప్రజా ప్రతినిధులు,బ్లాక్ కాంగ్రెస్,సీనియర్ నాయకులు,బీసీ,ఎస్సీ,మైనారిటీ, యూత్,యువజన సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



**అమ్మవారి కృప ప్రజలందరిపై ఉండాలి..**

నియోజకవర్గంలోని ప్రజలందరిపై దుర్గామాత అమ్మవారి కృప ఉండాలని,అమ్మవారి దయవల్ల నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు.జమ్మికుంట మండల పరిధిలోని గ్రామాల్లో దుర్గామాత మండపాలను దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## జిల్లా పరిషత్ పాఠశాలలో కోరమండల్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

**ఎడపల్లి, అక్టోబర్ 15 ( జనంసాక్షి ) :**

ఎడపల్లి మండలం జాన్కంపేట్ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం కోరమండల్ ఆధ్వర్యంలో విద్యార్థుల సౌకర్యార్థం మంచినీటిని అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్ ను గ్రామ సర్పంచ్ సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్, కోరమండల్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కోరమండల్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, కోరమండల్ ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్రాలలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మొత్తం 40 గ్రామాలను ఎంపిక చేసి ఆయా గ్రామాలలో గల పాఠశాలలో విద్యార్థుల కోసం వాటర్ ప్లాంట్లను ప్రారంభించడం జరిగిందన్నారు. అలాగే కోరమండల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్షిప్స్ లను సైతం అందించడం జరుగుతుందని అంతేకాకుండా డ్రోన్లను ఏర్పాటు చేసి జీవనోపాధి సైతం అందించడం జరుగుతుందన్నారు. రైతులు అధిక ఎరువుల బారిన పడకుండా తక్కువ మోతాదులో ఎరువులను వాడుతూ అభివృద్ధి బాటలో పయనించే విధంగా కోరమండల్ ఎప్పుడు రైతుల వెన్నంటే ఉంటుందని అలాగే గ్రామాల అభివృద్ధికి సైతం దృష్టి సారిస్తుందన్నారు. అందులో భాగంగా జానకంపేట్ గ్రామాన్ని కోరమండల్ దత్తత తీసుకోవడం జరిగిందని మునుముందు మరిన్ని కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని భాస్కర్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్, ఉప సర్పంచ్ నీలం కృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ ఉప్పు కవిత, కోరమండల్ ప్రతినిధులు సజన్, అబ్బన్న, వంశీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు గౌతమ్ కుమార్

# అక్రమ అరెస్టు సిగ్గుచేటు

### ఏఐకేఎంఎస్ బోధన్ డివిజన్ కార్యదర్శి సూర్య విఠల్

**బోధన్, అక్టోబర్ 15 ( జనంసాక్షి )**



భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ ను రద్దు చేయాలని, అక్రమంగా తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ హైద్రాబాద్ లోనీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయం ముందు శాంతియుతంగా ధర్నా చేపట్టిన పి డి యస్ యు, పివైఎల్ నాయకులను నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఆర్ గౌతమ్ కుమార్ ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని అఖిల భారత రైతు కూలీ సంఘం బోధన్ డివిజన్ కార్యదర్శి సూర్య విఠల్ ఖండించారు. దేశంలో ఢిల్లీ కేంద్రంగా రాహుల్ గాంధీ నిరసన వ్యక్తపరుస్తూ ర్యాలీలు ధర్నాలు చేస్తారు అదే డిమాండ్ పై తెలంగాణ రాష్ట్రంలో మాత్రం నిరసన కార్యక్రమం చేపట్టిన నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించడానికి వారు తప్పు పట్టారు అరెస్టు చేసిన నాయకులను భేషరత్ గా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు అలాగే ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ,ఆయన పై స్వతంత్ర న్యాయ విచారణ చేపట్టాలని లేనిపక్షంలో ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం

**బోధన్, అక్టోబర్ 15 ( జనంసాక్షి ) :**

బోధన్ పట్టణంలోని టిటిడి కళ్యాణ మండపంలో బోధన్ ఏక చక్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజామాబాద్ జిల్లానూతన కార్యవర్గానికి గురువారం ఘనంగా సన్మానించారు. చైర్మన్ పోతన్ కర్ లక్ష్మీనారాయణ, కోశాధికారి కెనీపుల్ నాగరాజు, సభ్యులు కొండా సత్యప్రసాద్, ఎండల సుధాకర్, పద్మ సుభాష్, బాలాజీలను పూలమాలలు, శాలువాలు మెమెంటో లతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని ప్రాంత సంఘటన మంత్రి యాదిరెడ్డి, బోధన్ ఏక చక్ర సేవాసమితి అధ్యక్షులు అంకు మహేష్, గౌరవ అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాసరావు, సలహాదారులు ప్రవీణ్ మహారాజ్,సభ్యులు లక్ష్మణరావు పటేల్, సంగం శ్రీనివాస్, రవి గౌడ్, రవీందర్ రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



# యాసంగిలో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరి సాగుకు దూరంగా ఉండాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష

**- తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి**

**- వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి,అక్టోబర్ 15(జనంసాక్షి) :** యాసంగి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు.తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,యాసంగి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని సాగు నిర్ణయాలు తీసుకోవాలని, అవసరమైతే పొలాలను బీడుగా ఉంచుకోవాలని తెలిపారు.వరి సాగుకు బదులుగా మొక్కజొన్న, పప్పుధాన్యాలు, కూరగాయలు వంటి తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు సూచించాలని అధికారులను ఆదేశించారు.తక్కువ కాలంలో దిగుబడి వచ్చే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టాలను నివారించేందుకు, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు రైతులకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు.



వ్యవసాయ,ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై మార్గదర్శనం చేయాలని ఆదేశించారు.వానాకాలం సీజన్‌లో ధాన్యం సేకరణకు సంబంధించి ముందస్తు అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు.జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు (పీపీసీ) ఎంత పరిమాణంలో ధాన్యం వచ్చే అవకాశం ఉంది, ప్రైవేటు మార్కెట్‌కు ఎంత పరిమాణంలో వెళ్లే అవకాశం ఉందనే అంశాలపై స్పష్టమైన అంచనాలు రూపొందించాలని ఆదేశించారు.ఈ వివరాల ఆధారంగా ధాన్యం సేకరణకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని తెలిపారు.వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ,వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు సరైన పంటల ఎంపికపై సూచనలు అందించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలవిద్యార్థుల అత్యంత ప్రతిభ

**- రాష్ట్రస్థాయి పోటీలకు తరలుతున్న విద్యార్థులు**






**సుల్తానాబాద్,అక్టోబర్ 15(జనంసాక్షి) :** జిల్లా కో,కోఅసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాఘవ పూర్లో జరిగిన పెద్దపల్లి జిల్లాస్థాయి కోకోపోటీలలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సుల్తానాబాద్‌కు చెందిన నలుగురు విద్యార్థులు, అశ్విత్, చక్రీ, ప్రవీణ్,హరీష్ అత్యంత ప్రతభ కనబరిచి,ఈ నెల 15,16,17,తేదీలలో రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ లో జరిగే రాష్ట్రస్తాయి పోటీలలో పెద్దపల్లి జిల్లా తరుపున పాల్గొంటారు. వీరిని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె కోటి పిడి ప్రసాద్ పిఈటి సురేందర్ లు గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## నేడు మండల పరిషత్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

**- విజయవంతం చేయండి ఎంపీడీవో దివ్యదర్శనరావు**



**సుల్తానాబాద్,అక్టోబర్ 15(జనంసాక్షి) :** బతుకమ్మ పండుగను పురస్కరించుకొని నేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాయంత్రం నాలుగు గంటలకు జరిగే బతుకమ్మ సంబరాలలో మండలంలోని అన్ని గ్రామాల మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవో దివ్యదర్శనరావు కోరారు. సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టేలా ఘనంగా అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# కాయకల్ప అవార్డులో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి ప్రథమ బహుమతి

**- డాక్టర్ కే శ్రీధర్.(సూపరిండెంట్)**




**పెద్దపల్లి,అక్టోబర్ 15(జనంసాక్షి) :** పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిశుభ్రత,పారిశుద్ధ్యం, రోగుల భద్రత,ఆసుపత్రి నిర్వహణ ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో నిర్వహిస్తున్న కాయకల్ప కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మొదటి బహుమతి లభించింది.2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రకటించిన కాయకల్ప అవార్డుల జాబితాలో పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి 90 స్కోరు సాధించి, "బెస్ట్ షేరింగ్" విభాగంలో మరియు 91 స్కోర్ సాధించి, "ఎకో ఫ్రెండ్లీ" విభాగాలలో ఈ అవార్డుకు ఎంపికైంది.ఆసుపత్రిలో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, ఇన్‌ఫెక్షన్ నియంత్రణ,బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చేపడుతున్న చర్యలకు ఈ గుర్తింపు లభించింది.ఈ అవార్డు ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది మరియు ఇతర ఉద్యోగుల సమిష్టి కృషికి గుర్తింపుగా నిలుస్తుంది. ఈ పురస్కారం ఆసుపత్రిలో సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు ప్రోత్సాహాన్ని అందించనుంది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ని,ఆసుపత్రి వైద్యులు మరియు ఇతర సిబ్బందిని అభినందించడం జరిగింది.

# నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు జిల్లా ఉపాధి కల్పనాధికారి

**- ఎం. రాజశేఖర్**

**పెద్దపల్లి,అక్టోబర్ 15(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 'తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కం) ద్వారా పెద్దపల్లి జిల్లాకు చెందిన అర్హులైన నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయని లిజిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్‌లి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒమన్, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (అబుదాబి), కువైట్, ఖతార్ దేశాల్లో వివిధ రంగాలకు సంబంధించిన ఉద్యోగాలకు అర్హతలు, అనుభవం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.వివిధ దేశాల్లో అందుబాటులో ఉన్న విదేశీ ఉద్యోగావకాశాల వివరాలు : ఒమన్ దేశంలో అగ్రికల్చర్ వర్కర్ విద్యా అర్హత: పదవ తరగతి,ఇంటర్మీడియట్ , డిప్లొమా , బహ్రెయిన్ లో లాస్ రికవరీ సూపర్వైజర్ విద్యాఅర్హత : ఏదైనా డిగ్రీ ,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ -అబుదాబిలో పైప్‌లైన్ రిపేర్ , ఇంటెగ్రిటీ ఎక్విప్‌మెంట్ , విద్యా అర్హత బిఇ మెకానికల్ అనుభవాన్ని డ్రిల్లింగ్ ,డౌన్‌హోల్, కంప్లీషన్ టూల్స్, విద్యా అర్హత బిఇ మెకానికల్ ,కువైట్ లో సూపర్ వైజర్, కెమిస్ట్ విద్యా అర్హత బీఎస్సీ డిప్లొమా ,ఖతార్ లో నర్స్ టెక్నీషియన్, నర్సింగ్ లైసెన్స్‌డ్ ప్రాక్టీషనర్ నర్స్ ,విద్యా అర్హత సంబంధిత నర్సింగ్ అవసరమైన ప్రొఫెషనల్ లైసెన్స్ మరిన్ని వివరాల టామ్ కామ్ హెల్ప్‌లైన్ నంబర్లలో 08035524946, 040-23342040 సంప్రదించవచ్చని, జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువత తమ విద్యార్హతలు, అనుభవానికి తగిన ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# పేదింటి ఆడపిల్లల కళ్యాణానికి వరం షాదీ ముబారక్ కళ్యాణలక్ష్మి

**- తల్లిదండ్రుల కళ్ళల్లో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యం**

**- రైతు సంక్షేమమే ప్రభుత్వ ఆశయం**

**- రైతులు ఆరుతడి పంటలపై మక్కువ చూపాలి**

**- కోటి 40 లక్షల కల్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన**

**- రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**

**సుల్తానాబాద్,అక్టోబర్ 15(జనంసాక్షి) :** పేదింటి ఆడపిల్లల కళ్యాణానికి, వరం లాంటిది, కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకమని రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. గురువారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఎస్వీఆర్ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో సుల్తానాబాద్ మండలం తో పాటు ఎలిగేడు మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ తో పాటు సుల్తానాబాద్ మున్సిపల్ కార్మికులకు దుస్తులు పాదరక్షలను అందించారు. సమావేశానికి ముందు మండల ప్రజల కు సద్దుల బతుకమ్మ , దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట,వి జయరమణారావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిందని ఉచిత విద్యుత్, బస్సు ప్రయాణం 500 కు గ్యాస్ సిలిండర్, సన్న వడ్లకు బోనస్, ఇందిరమ్మ ఇండ్లు ఇలా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్విరామం రాష్ట్రం అభివృద్ధి తో పాటు ప్రజల ప్రయోజనాల కోసం పరితపిస్తున్నారని అందులో భాగంగానే రైతుల వడ్ల సన్న వడ్లకు బోనస్ అందిస్తూ కొనుగోలు చేపడుతూ రైతులకు మద్దతు ధర అందిస్తున్నారని వివరించారు. మీ ఎమ్మెల్యేగా విజయ రమణారావు అండగా ఉన్నంతకాలం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాటుపడతారని పదవిలో ఉన్న లేకున్నా రైతుల, ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు రానున్న ఏ సంగీ లో ఎట్టి పరిస్థితుల్లో వరి పొలాలు వేయవద్దని ఎలినోవా ప్రభావంతో తీవ్ర ఎండలు వీచే అవకాశాలు ఉన్నాయని తద్వారా భూగర్భ జలాలు అడుగంటిపోయి రైతులు వేసిన పంటలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారి కి బదలు ఆరుతడి పంటలు వేసి లబ్ధి పొందాలని ఏ పంట వేసినా ప్రభుత్వంతో తాను కొనుగోలు చేపిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం లబ్ధిదారులకు సుల్తానాబాద్ 126 , ఎలిగేడు 14 కోటి 40 లక్షల రూపాయల చెక్కుల పంపిణీ చేపట్టారు. మున్సిపల్



కార్మికులకు దుస్తులు పాదరక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, మున్సిపల్ కమిషనర్ టి రమేష్, తహసిల్దార్ బసిరుద్దీన్, సుల్తానాబాద్ ఎలిగేడు మండలాల సింగిల్ విండో చైర్మన్ లుసామ రాజేశ్వర్ రెడ్డి, చిలుక సతీష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేత దాన్నా యక్ దామోదర్ రావు,మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అబ్బయ్య గౌడ్, కౌన్సిలర్లు, గాజుల రాజమల్లు,ఉట్ల వర ప్రదీప్, సిద్ధ తిరుపతి, చింతల రాజు, సర్పంచులు ఉప్పు లక్ష్మి, మేకల పోచాలు, గుడి కందుల భాగ్యలక్ష్మి, సుబ్బని అనసూర్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు నామని రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కోదాటి సాయికిరణ్, గుండేటి దేవేందర్, పోచంపల్లి చిన్నయ్య,కాంపల్లి సతీష్ కుమార్, ఓగుల పూజ రాజేందర్,ఆర్ ఐ మహేష్,మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

# లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం

- మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే రామారావుపటేల్ సహా పలువురు నేతలు



**కరీంనగర్ బ్యూరో అక్టోబర్ 15 ( జనం సాక్షి) :** దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో 5వ రోజైన గురువారం శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి(స్కంద మాత) అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలయ నిర్వాహకులు అమ్మవారిని పండ్లతో అలంకరించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మహాచండీ దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మరోవైపు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, నగర కార్పొరేటర్లతోపాటు బైంసా మున్సిపల్ ఛైర్మన్ తుమ్మోళ్ల దత్తాత్రి, బైంసా మున్సిపాలిటీ కార్పొరేటర్లు శ్రీ మహాశక్తి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**సకల సౌభాగ్యాల ప్రదాయిని.. లలితా త్రిపుర సుందరీ దేవి**

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో లలితా త్రిపుర సుందరీ దేవి ఆరాధనకు విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. ఆదిపరాశక్తి స్వరూపిణిగా కొలువుదీరే అమ్మవారు సౌందర్యం, జ్ఞానం, కరుణ, అపారమైన దైవశక్తికి ప్రతీకగా భక్తుల పూజలందుకుంటారు. శ్రీవిద్యా సంప్రదాయంలో పరమేశ్వరిగా పూజలందుకునే లలితాదేవిని సకల లోకాలకు మూలశక్తిగా భక్తులు విశ్వసిస్తారు. లలితా త్రిపుర సుందరీ దేవిని శ్రీచక్ర అధిష్ఠాన దేవతగా ఆరాధిస్తారు. శ్రీచక్రం శ్రీవిద్యా ఉపాసనలో అత్యంత పవిత్రమైన యంత్రంగా ప్రసిద్ధి చెందింది. అమ్మవారిని సాధారణంగా పాశం, అంకుశం, చెరకు విల్లు, పుష్పబాణాలు ధరించిన రూపంలో చిత్రిస్తారు. ఈ ఆయుధాలు మనస్సును నియంత్రించడం, కోరికలను సన్మార్గంలో నడిపించడం, దైవిక సంకల్పానికి ప్రతీకలుగా ఆధ్యాత్మికంగా వివరించబడతాయి. లలితాదేవిని ఆరాధించడం ద్వారా మనశ్శాంతి, జ్ఞానం, వివేకం, కుటుంబ సౌభాగ్యం కలగాలని భక్తులు ప్రార్థిస్తారు. కోపం, అహంకారం, దురాలోచనలను విడిచిపెట్టి ప్రేమ, కరుణ, ధర్మబద్ధమైన జీవనాన్ని అలవర్చుకోవాలనే సందేశాన్ని అమ్మవారి ఆరాధన గుర్తుచేస్తుంది. సకల శక్తులకు మూలమైన జగన్మాతగా, భక్తుల పాలిట కరుణామయిగా కొలువుదీరే లలితా త్రిపుర సుందరీ దేవి ఆరాధన దేవీ నవరాత్రులకు ఆధ్యాత్మిక శోభను చేకూరుస్తుంది. అమ్మవారి అనుగ్రహంతో సకల జనులకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని భక్తులు ప్రార్థిస్తారు.



## ఆదర్శ మున్నూరు కాపు సంఘంలో కుంకుమార్చనలు..

**కొత్తపల్లిలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు**

**సుభాష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం..**

**భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ**

**గంభీరావుపేట, సెప్టెంబర్ 15 జనం సాక్షి:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని ఆదర్శ మున్నూరు కాపు సంఘంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సుభాష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 14వ వార్షికోత్సవం సందర్భంగా దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నప్రసాదంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నాగపురి బాలరాజు గౌడ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు బొల్లారపు మధు, మేడ రవి, ఆరేటి బాలరాజు, బొల్లారపు బాలమణి గోపాల్, నాగపురి రమ్య?రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## సైదాపూర్ మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



సైదాపూర్, అక్టోబర్ 15:( జనం సాక్షి) సైదాపూర్ మండల పరిధిలోని ఎలబోతారం (చింతలపల్లి) గ్రామంలోని శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు శ్రీ వొడితల సతీష్ కుమార్ గారు హాజరయ్యారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. పార్టీ శ్రేణులందరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతమే లక్ష్యం: ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండాలి: పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై పోరాటం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, ప్రజల పక్షాన నిలబడి వాటి పరిష్కారం కోసం పోరాడాలని అన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటాం: పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ముందుకు సాగుతూ పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఐకమత్యంతో ముందుకు సాగాలి: నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, ఐకమత్యం ఎంతో ముఖ్యమని, అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.సైదాపూర్ మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ సైదాపూర్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల పార్టీ అధ్యక్షులుగా: చల్మెడ రాజేశ్వర్ రెడ్డి

మండల పార్టీ ప్రధాన కార్యదర్శిగా: పైడిపల్లి రవీందర్ గౌడ్నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో పార్టీని మండలంలోని ప్రతి గ్రామంలో మరింత బలోపేతం చేస్తూ, పార్టీ కార్యకలాపాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ నాయకులు పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సమన్వయానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో సైదాపూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఐఫోన్‌ను యజమానికి అప్పగించిన ఆటో డ్రైవర్

**మల్యాల అక్టోబర్ 15 (జనం సాక్షి)**

మల్యాల మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ మల్యాల అశోక్ కు గురువారం ఉదయం ఐఫోన్ దొరికింది.చొప్పదండికి చెందిన శేఖర్ దిగా గుర్తించి తిరిగి అతనికి ఐ ఫోన్ అందజేశాడు.అశోకు నిజాయితీకి పలువురు అభినందించారు.

## కనకదుర్గ అమ్మవారికి వసంతోత్సవం..

**స్కందమాత రూపంలో కనక దుర్గ అమ్మవారు దర్శనం**

**జగిత్యాల బ్యూరో అక్టోబర్15 (జనం సాక్షి)**



కనక దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో అష్టలక్ష్మి దేవాలయ అవరణలో నిర్వహిస్తున్న దుర్గా శరన్నవరా త్రోత్సవాలు గురువారంవైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కనక దుర్గ అమ్మవారు స్కందమాత రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకలశ పూజ,లలితపారాయణం నక్షత్ర హారతి, మహిళలు, భవానీ దీక్ష స్వాములతో ,భక్తులతో అమ్మవారు మండపం కిటకిటలాడింది అనంతరం భక్తులకు అల్పాహారం అందించడం జరిగింది. సాయంత్రం అమ్మవారిని అనేక రకాల పండ్లతో అలంకరణతో అమ్మవారికి వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు, పండ్ల రసాలచే అభిషేకం సప్త హారతులతో మండపం ప్రాంగణం భక్త కీర్తనలతో మారుమోగిందని కనక దుర్గా సేవా సమితి సభ్యులు తెలిపారు.

## గొప్పతనం చాటుకున్న బీజేపీ కౌన్సిలర్ అనూష అనురాగ్ దంపతులు

**- మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులకు పండుగ కానుకగా దుస్తులు**



**హుజూరాబాద్, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** తెలంగాణలో అతి పెద్ద, సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ, దసరా పండుగలను అందరూ సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో పట్టణంలోని 20వ వార్డు బీజేపీ కౌన్సిలర్ దామెర అనూష అనురాగ్ దంపతులు మున్సిపాల్ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేసి గొప్పతనాన్ని చాటుకున్నారు. 20వ వార్డులో పని చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశావర్కర్లకు సొంత డబ్బులతో దుస్తులను కొనుగోలు చేసి బతుకమ్మ, దసరా పండుగ కానుకగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా అనూష అనురాగ్ మాట్లాడుతూ... పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని, వారు ఎండనకా వాననకా రేయింబవళ్లు కష్టపడి పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ప్రతిరోజూ అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు పారిశుద్ధ్య సేవలు అందిస్తుండటం వల్లనే పట్టణం పరిశుభ్రంగా ఉంటుందని అన్నారు. నిత్యం కష్టపడే పారిశుద్ధ్య కార్మికులు తమ కుటుంబ సభ్యులతో పండగలను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా వారికి దుస్తులు అందించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు కౌన్సిలర్ అనూష అనురాగ్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

# నిజాంసాగర్ మండలంలో ఘనంగా పిఎసిఎస్ చైర్మన్ల ప్రమాణ స్వీకార మహోత్సవం

**కామారెడ్డి అక్టోబర్ 15 (జనం సాక్షి)**
కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోరైతు సంక్షేమం, సహకార రంగ అభివృద్ధే ధ్యేయంగా నూతన చైర్మన్ల బాధ్యతల స్వీకరణముఖ్య అతిథులుగా జుక్కల్ ఎమ్మెల్యే శ్రీ తోట లక్ష్మీ కాంతరావుకామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు శ్రీ ఏలే మల్లికార్జున్ కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట, మల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఏసిఎస్) నూతన చైర్మన్ల ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం గోర్గల్ సొసైటీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట (పిఏసిఎస్ )చైర్మన్‌గా పట్లోళ్ల జనార్దన్ రెడ్డి , మల్లూరు (పిఏసిఎస్) చైర్మన్‌గా భుజంగారి వినోద వెంకట్రామిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ తోట లక్ష్మీకాంతరావు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షులు శ్రీ ఏలే మల్లికార్జున్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన చైర్మన్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

**రైతు సంక్షేమానికి పెద్దపీట వేయాలి**
సహకార రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ, రైతులకు అవసరమైన సేవలను సమర్థవంతంగా అందించడంలో (పిఏసిఎస్) కీలక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



రైతుల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాలని నూతన చైర్మన్లకు శుభాకాంక్షలు తెలిపారు.
నూతన నాయకత్వంలో అచ్చంపేట, మల్లూరు సహకార సంఘాలు మరింత అభివృద్ధి సాధించి, రైతులకు మెరుగైన సేవలు అందిస్తాయని ఆశాభావం వ్యక్తమైంది. ఈ కార్యక్రమానికి జుక్కల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్లు, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన చైర్మన్లకు అభినందనలు తెలియజేశారు. అచ్చంపేట, మల్లూరు (పిఏసిఎస్) నూతన చైర్మన్లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రైతు సంక్షేమం మన లక్ష్యం ? సహకార రంగ అభివృద్ధి మన ధ్యేయం ? ప్రజా సేవ మన బాధ్యత అని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు తెలిపారు.







# సిరిసిల్లాలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు

**○ప్రతిరోజు అమ్మవారి నిత్యాలంకరణ**

**○అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు**

**సిరిసిల్ల టౌన్ అక్టోబర్ 15 (జనంసాక్షి)**
సిరిసిల్లలోని నెహ్రూ నగర్ శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నాలుగవ రోజైన గురువారం రోజు ఉదయం 9:30 నిమిషాలకు శ్రీ లలితా దేవి అలంకరణ, అభిషేకం పూజ, హోమం, సాయంత్రం 6:30 కు శ్రీ లలితా దేవి, కూస్మాండ దేవి, షోడశోపచర పూజ హారతి కార్యక్రమాలు పండితులు శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆలయ శ్రీ అంబ భవాని దేవాలయ పండితులు శ్రీధర్ శర్మ మాట్లాడుతూ ప్రతిరోజు అమ్మవారి నిత్యాలంకరణ ఉంటుందని, అమ్మవారిని అన్నపూర్ణేశ్వరిగా నెలకొల్పినట్లు తెలిపారు. రేపు గురువారం రోజున శ్రీ లలితా దేవి అలంకరణ గావించబడతాయని తెలిపారు అలాగే అభిషేక పూజ, దుర్గా శ్రీ లలితా దేవి హోమము కుసుమాండదేవి, హారతి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ఓడి బియ్యం కట్టిన కానుకలు సమర్పించాలని కోరారు. శ్రీ అంబ భవాని దేవాలయ అధ్యక్షులు, కార్యనిర్వాహకులు చిలుక నారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అంబ భవాని శరన్నవరాత్రోత్సవాలు జరుపుతున్నట్లు తెలిపారు. భక్తులు ప్రతి సంవత్సరం అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని, మహిమగల అమ్మవారు అని మొక్కులుతీర్చే తల్లి అని, అమ్మవారికి కట్న కానుకలు చందా రూపేనా అందిస్తున్నారని, భక్తులకు అన్ని వసతులు సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

# సింగరేణి కార్మికులకు వరాల జల్లు

## ○కాంగ్రెస్ ప్రభుత్వానికి ఐఎన్టీయూసీ పాలాభిషేకం

**○కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు హర్షణీయం: ఐఎన్టీయూసీ నాయకులు**

**○ఆర్జీ-3 ఏరియా, ఓసీ-1 వద్ద గేట్ మీటింగ్.. ప్రభుత్వానికి కృతజ్ఞతలు**

**యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి)**
అక్టోబర్ 15: సింగరేణి కార్మికుల సంక్షేమానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పలు ప్రయోజనాలను ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఐఎన్టీయూసీ నాయకులు, కార్మికులు సంబరాలు జరుపుకున్నారు. ఆర్జీ-3 ఏరియా ఓసీ-1 ఆపరేషన్ సైట్ ఆఫీస్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఐఎన్టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఎన్టీయూసీ సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహారెడ్డి, ధర్మపురి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డాక్టర్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో నిరంతరం కృషి చేస్తోందని నాయకులు తెలిపారు. ఈ కృషి ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సింగరేణి కార్మికులకు పలు ప్రయోజనాలను ప్రకటించిందని పేర్కొన్నారు. కార్మికులకు 34 శాతం లాభాల వాటా, కాంట్రాక్టు కార్మికులకు రూ. 5,500 ఆర్థిక ప్రయోజనం, రూ. 1,754 కోట్ల లాభాల్లో వాటాగా ఒక్కో కార్మికుడికి సగటున రూ. 1,54,000 అందే అవకాశం వంటి ప్రకటనలు కార్మికుల్లో ఆనందాన్ని నింపాయని అన్నారు. సొంతింటి పథకం అమలుకు చర్యలు, పెర్క్స్‌పై ఆధారిత ఆదాయపు పన్ను మినహాయింపు, మారుపేర్ల సమస్య పరిష్కారం, అధికారులకు పీఆర్పీ చెల్లింపు వంటి అంశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయని వివరించారు. అలాగే డిస్మిస్ అయిన కార్మికులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా తిరిగి ఉద్యోగాల్లో చేరే అవకాశం కల్పించడం, పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలకు 15 రోజుల్లో నియామక పత్రాలు అందించే చర్యలు చేపట్టడం, మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియను ఏరియా ఆసుపత్రిలోనే నిర్వహించడం, ఆసుపత్రుల అభివృద్ధి, కార్మికుల క్వార్టర్ల ఆధునికీకరణ వంటి నిర్ణయాలు కార్మికుల కుటుంబాలకు ఎంతో మేలు చేస్తాయని నాయకులు హర్షం వ్యక్తం చేశారు.
గత ప్రభుత్వ హయాంలో, గతంలో పనిచేసిన యూనియన్ నిర్లక్ష్యం కారణంగా కొత్త గనుల ఏర్పాటు విషయంలో తగిన ప్రాధాన్యత లభించలేదని నరసింహారెడ్డి విమర్శించారు. ప్రస్తుతం కేంద్ర మంత్రి సహకారంతో సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటుకు విస్తృత ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. కొత్త గనులు ప్రారంభమైతే సంస్థ మనుగడకు భరోసా లభించడంతో పాటు కార్మికులకు ఉపాధి భద్రత, భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.
కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పలు నిర్ణయాలు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వానికి ఐఎన్టీయూసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఎన్టీయూసీ నాయకులు వడ్డేపల్లి దాసు, ఆర్జీ-3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి, ఏరియా కార్యదర్శి శ్రీనివాసరావు, ఓసీ-1 పిట్ కార్యదర్శి తోకల ప్రవీణ్ రెడ్డి, సీహెచ్‌పీ పిట్ కార్యదర్శి కిషన్ నాయక్, ఐఎన్టీయూసీ నాయకులు ఎం. ప్రభాకర్ రెడ్డి, సయ్యద్ సలీం, నరేష్ కుమార్, రవికుమార్, గంధం శ్రీనివాస్, సాతిని నాగరాజు, లక్ష్మణాచారి, చంద్రయ్య, జంజర్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





# దేవి శరణ్ నవరాత్రోత్సవాల సందర్భంగా ఘనంగా కుంకుమ పూజ

**ఇల్లంతకుంట అక్టోబర్ 15(జనంసాక్షి )**
ఇల్లంతకుంట గ్రామంలో బస్టాండ్ ఆవరణలో దేవి శరణ్ నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో కుంకుమ పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అర్చకులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్ శర్మ, సంతోష్, దుర్గా భవాని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.



# శ్రీ దుర్గ మాత విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**ముస్తాబాద్ అక్టోబర్ 14 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో గ్రామ కుల పెద్దలు గ్రామ సర్పంచ్ సురభి దశరథ రావు ఆధ్వర్యంలో దుర్గ మాత విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని కుల సంఘాల నాయకులు మహిళలు యజ్ఞంలో పాల్గొన్నారు



# సారస్ మేళా-2026లో కామారెడ్డి మహిళల విజయాలు అభినందనీయం..

◆మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాలు దోహదం

◆మహిళా సంఘాల సభ్యులు, ప్రోత్సహిస్తున్న సిబ్బందిని అభినందించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్






**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (జనంసాక్షి):** హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ మైదానంలో నిర్వహిస్తున్న సారస్ మేళా?2026లో కామారెడ్డి జిల్లాకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ ఉత్పత్తులను ప్రదర్శించి, విక్రయాలు చేపడుతూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధిస్తూ, తమ కుటుంబాల అభివృద్ధికి తోడ్పడటం సంతోషకరమని పేర్కొన్నారు.

**మహిళల విజయాలకు కలెక్టర్ అభినందనలు**

సారస్ మేళాలో కామారెడ్డి జిల్లాకు చెందిన దేవల సరోజ, కే. సుజాత, మోతే సుప్రియ సంప్రదాయ వంటకాలు, పచ్చళ్లు, చిరుధాన్య ఉత్పత్తులు, గానుగ నూనెలను విక్రయిస్తూ విజయవంతంగా ముందుకు సాగుతున్నారు. తమ నైపుణ్యాలను వ్యాపార అవకాశాలుగా మలుచుకుని ఆదాయం పొందడంతో పాటు, ఇతర మహిళలకు ఉపాధి కల్పిస్తున్న వారి కృషి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ అభినందించారు. మహిళలు తమలోని ప్రతిభను గుర్తించి, స్వయం ఉపాధి రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా అందుతున్న పొదుపు, రుణ సదుపాయాలు, బ్యాంకుల సహకారం, ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వీటి ద్వారా చిన్న తరహా వ్యాపారాలను అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని పేర్కొన్నారు. మహిళలు తయారు చేస్తున్న సంప్రదాయ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు, వాటికి మార్కెట్ అవకాశాలు పెంచేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.

**గ్రామీణ మహిళలకు సారస్ మేళా చక్కని వేదిక**

సారస్ మేళా వంటి ప్రదర్శనలు గ్రామీణ మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను విస్తృత స్థాయిలో వినియోగదారులకు పరిచయం చేసేందుకు, వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు. మహిళల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు గ్రామీణ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదం జరుగుతుందని పేర్కొన్నారు. సారస్ మేళాలో పాల్గొంటున్న కామారెడ్డి జిల్లా మహిళలకు అవసరమైన సహకారం అందిస్తూ, వారి విజయాలకు తోడ్పడుతున్న సంబంధిత అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు..






## వే -సైదాపూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా సీహెచ్. రాశ్వర్ రెడ్డి

### ప్రధాన కార్యదర్శిగా రవీందర్ గౌడ్ ఎన్నిక

సైదాపూర్ అక్టోబర్ 15( జనం సాక్షి)

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో నూతన మండల అధ్యక్షుడిగా సీహెచ్. రాశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రవీందర్ గౌడ్ ఎన్నికయ్యారు.

మాజీ ఎమ్మెల్యే శ్రీ వొడితల సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, మండలంలోని నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నూతన బి ఆర్ ఎస్ అధ్యక్షుడు చల్మడ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ కు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు నాకు పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు ఆనందంగా ఉందన్నారు మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అలాగే పార్టీ నాయకులు నాకు సహకరించాలని అన్నారు

# కృష్ణవేణి పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**బాల్కొండ మండల్ 15 అక్టోబర్ (జనంసాక్షి)**

నిజామాబాద్ జిల్లా బాల్కొండ కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో డైరెక్టర్ విగ్నేశ్వర్. ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్. అధ్యాపక బృందం. బతుకమ్మ సంబరాలు. ఘనంగా నిర్వహించారు.బతుకమ్మ తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక మైన పూల పండుగ. ప్రకృతి, పూలు, నీరు, స్త్రీల ఆత్మీయతను గౌరవించే ఈ వేడుక తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. సాధారణంగా బతుకమ్మ పండుగ తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తారు. ఎలా జరుపుకుంటారు?మహిళలు, బాలికలు తంగేడు, గునుగు, బంతి, చామంతి, గులాబీ, తామర వంటి వివిధ రకాల పూలను సేకరించి, వాటిని గోపురాకారంలో అందంగా పేర్చి బతుకమ్మను తయారు చేస్తారు. బతుకమ్మను మధ్యలో ఉంచి చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ నృత్యం చేస్తారు.బతుకమ్మను గౌరమ్మ స్వరూపంగా భావించి పూజిస్తారు. చివరి రోజున బతుకమ్మను సమీపంలోని చెరువు లేదా నీటి వనరులో నిమజ్జనం చేసి, కుటుంబ సభ్యుల ఆరోగ్యం, సౌభాగ్యం, పంటల సమృద్ధి కోసం ప్రార్థిస్తారు.తొమ్మిది రోజుల పేర్లు ప్రాంతాను సారం పేర్లలో స్వల్ప మార్పులు కనిపించినా, సాధారణంగా బతుకమ్మ రోజులు ఇలా ఉంటాయి: ఎంగిలిపూల బతుకమ్మఅటుకుల బతుకమ్మ ముద్దపప్పు బతుకమ్మనానే బియ్యం బతుకమ్మఅట్ల బతుకమ్మఅలిగిన బతుకమ్మవేపకాయల బతుకమ్మ వెన్నముద్దల బతుకమ్మ సద్దులబతుకమ్మమొదటి రోజు ఎంగిలిపూలబతుకమ్మతో వేడుకలు ప్రారంభమై, చివరి రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. నైవేద్యాలు తొమ్మిది రోజులలో వివిధ



రకాలప్రసాదాలు తయారుచేస్తారు. ముఖ్యంగా:సద్దులు లేదా రకరకాలఅన్న ప్రసాదాలుపప్పులు, నువ్వులు, బెల్లంఅటుకులు ముద్ద పప్పుసత్తుపిండిపులిహోర, చక్కెర పొంగలివంటివంటకాలుచివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా పెరుగు సద్దులు, చింతపండు సద్దులు, నువ్వుల సద్దులు, కొబ్బరి సద్దులు వంటి ప్రసాదాలు సమర్పించే సంప్రదాయం ఉంది.ప్రాధాన్యతబతుకమ్మ పండుగకు అనేక సామాజిక, సాంస్కృతిక ప్రాముఖ్యం ఉన్నాయి: ప్రకృతి, పూలు, పర్యావరణాన్ని గౌరవించడం. మహిలు, బాలికలు సామూహికంగా కలుసుకుని ఆనందించడం. కుటుంబ బంధాలు, స్నేహాలు మరింత బలపడటం.తెలంగాణ జానపద గేయాలు, ఆచారాలు, సంప్రదాయాలను పరిరక్షించడం. నీటి వనరులు, పంటలు, ప్రకృతిసమృద్ధి కోసం ప్రార్థించడం. బతుకమ్మలో ఉపయోగించే తంగేడుపవ్వు తెలంగాణ రాష్ట్ర పుష్పంగా గుర్తించారు.ముగింపు బతుకమ్మ కేవలం ఒక పండుగ మాత్రమే కాదు; అది తెలంగాణ మహిళల ఆత్మీయత, ప్రకృతి పట్ల గౌరవం, జానపద సంస్కృతి, సామూహిక ఐక్యతకు ప్రతీక. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ ప్రజలు కలిసి నిర్వహించే ఈ పూల పండుగ తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటుతోంది.

## ఎంపీ నిధుల ద్వారా ఐమోస్ట్ లైట్లు మంజూరు

**రాయికల్ అక్టోబర్ జనం సాక్షి :**



జగిత్యాల రూరల్ మండలంలోని తక్కళ్లపల్లి మరియు రాయికల్ టౌన్ లో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ నిధుల ద్వారా ఐమాస్ట్ లైట్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని గురువారం బిజెపి జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్. బోగ శ్రావణి అందజేయడం జరిగింది. గ్రామంలో రాత్రివేళల్లో మెరుగైన వెలుతురు కల్పించడంతో పాటు ప్రజలకు భద్రత, సౌకర్యం కల్పించేందుకు ఈ హైమాస్ట్ లైట్లు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. గ్రామ అభివృద్ధికి సహకరించిన ఎంపీ ధర్మపురి అర్వింద్ కి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షులు కుర్మా మల్లరెడ్డి, జగిత్యాల్ పట్టణ అధ్యక్షులు కాశెట్టి తిరుపతి, స్థానిక కౌన్సిలర్ కల్లెడ ధర్మపురి,సురేష్,రాము, ఆముదరాజు, తక్కలపల్లి గ్రామ ఉపసర్పంచ్ కచ్చు మునిరాజు,బన్న సంజీవ్,గుర్రాల తిరుపతి రెడ్డి, పవన్ సింగ్, రవితేజ బోగ నరేష్,శ్రీనివాస్,శ్రవణ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక:జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర

**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (జనంసాక్షి)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కార్యాలయ ప్రాంగణం బతుకమ్మ పాటలు, మహిళల సందడితో పండుగ శోభను సంతరించుకుంది.వేడుకల్లో భాగంగా మహిళా పోలీస్ సిబ్బంది వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహిస్తూ పండుగ విశిష్టతను చాటిచెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ పాల్గొని మహిళా పోలీస్ సిబ్బందితో కలిసి వేడుకలను వీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ మన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.అనంతరం జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు, సిబ్బందికి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.





# మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

## మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్..

**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (జనంసాక్షి)** కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొని, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. మహిళలంతా సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగకు ప్రత్యేక మైన ప్రాధాన్యత ఉందన్నారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే ఈ పండుగ మహిళల్లో ఐక్యతాభావాన్ని పెంపొందించడంతో పాటు, మన



సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కాసార్ల గోదావరి, కమిషనర్ పర్వతాలు, ఆర్ఓ గోపాలరెడ్డి, డీఈ హన్మంతరావు, ఏఈ వేణు ప్రసాద్, టీపీఓ వినీత్, దేవరాజు, మేనేజర్ భాగ్యలక్ష్మి, ఆర్ఐ సాయిలు, రమేష్, ఆర్పీలు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## జంగపల్లి గ్రామ పంచాయతీ సిబ్బందికి బతుకమ్మ - దసరా కానుకగా బట్టల పంపిణీ

**గన్నేరువరం, అక్టోబర్ 15 (జనంసాక్షి):** గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ తాడూరి కరుణ శ్రీ వెంకటరమణారెడ్డి దంపతులు బతుకమ్మ - దసరా పండుగ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాడూరి కరుణ శ్రీ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో పంచాయతీ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని, రేయింబవళ్లు కష్టపడి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న వారికి పండుగ కానుకగా చిన్నపాటి బహుమతి అందించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాంకాళి ప్రభాకర్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భారతరత్న అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివి

### బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం

**కరీంనగర్ బ్యూరో అక్టోబర్ 15 ( జనం సాక్షి) :**

భారతదేశ మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను బీజేపీ మైనారిటీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ ఆధ్వర్యంలో కరీంనగర్లోని పార్లమెంట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య అతిథిగా విచ్చేసి, అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం, మైనార్టీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ముజీబ్ లు మాట్లాడుతూ... డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కేవలం ఒక శాస్త్రవేత్త మాత్రమే కాదని, కోట్ల మంది యువతకు రోల్ మోడల్, నిరుపమాన దేశభక్తుడని కొనియాడారు. దేశ ప్రగతికి యువత శక్తి ఎంతో కీలకమని నమ్మిన కలాం , విద్యార్థుల్లో ఉన్నతమైన ఆలోచనలు నింపడానికి తన జీవితాంతం కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ, దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు,దేశ రక్షణ కోసం అబ్దుల్ కలాం చేసిన కృషి మరువ లేనివన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, సమియుల్లా అహ్మద్, సైద్, ఫయాజ్, అబూ బకర్, అమేర్, రౌఫ్,తదితరులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు.




# విద్యుత్ కోతలపై మండిపడ్డ కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

**కామారెడ్డి అక్టోబర్ 15 (జనంసాక్షి)** కామారెడ్డి జిల్లాలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఎల్నినో ప్రభావం దేశమంతా ఉన్న రాష్ట్రంలో ఉన్నట్టు చెప్పడం ప్రభుత్వ అసమర్ధతకు నిదర్శనమని మండిపడ్డారు. గురువారం కామారెడ్డి లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...నిన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారి సురేష్ ను సస్పెండ్ చేసి తన తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 2014 లో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చేనాటికి విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేదని, కేవలం మూడేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ అందించిందని గుర్తుచేశారు. అప్పటి అధికారులే ఇప్పుడు కూడా ఉన్నారని, అయినా 24 గంటల కరెంటు ఎందుకు రావడం లేదో చెప్పాల్సిన బాధ్యత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి దేనని చేతకాక అధికారులపై నెపం నెడుతున్నారని మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాలో రైతులు అర్ధనగ్నంగా తలకిందులుగా నిరసన తెలపడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. కెసిఆర్ ప్రభుత్వం సాగు, తాగునీటి కోసం భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్లు ఏర్పాటు చేస్తే రేవంత్ రెడ్డికి



వాటిని నడిపించే దమ్ము లేదని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేయాలని కుట్ర పన్నుతున్నారని, అలా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మధ్యప్రదేశ్ నుంచి వేసిన లైన్ల ద్వారా వచ్చే కరెంటును కూడా వినియోగించుకోవడం లేదన్నారు. మాచారెడ్డి మండలంలో ఓ దళిత రైతు జనరేటర్ పెట్టుకుంటే బెదిరించడం శోచనీయమని ఆరోపించారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం ఏర్పడేనాటికి 7వేల మెగావాట్లు ఉన్న థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని 20వేల మెగావాట్లకు తీసుకెళ్లిన ఘనత బీఆర్ఎస్ దేనని, ప్రస్తుతం ఆరేడు గంటలకు మించి కరెంటు సరఫరా జరగడంలేదని,ఇప్పటికైనా 18 గంటల కరెంటు ఇచ్చి పంటలను కాపాడాలని, ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాన్ని విమర్శించడం మర్చిపోయి ప్రజల సంక్షేమం మరియు రైతుల సంక్షేమం గురించి ఆలోచించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులను కాపాడడానికి ఏం చేస్తావు ప్రకటించాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు.

ఇట్టి సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జూకంటి ప్రభాకర్ రెడ్డి, కాసర్ల స్వామి, హఫీస్, రవి యాదవ్, కృష్ణాజీ రావు, బలవంతరావు తదితరులు పాల్గొన్నారు.

## కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై జ్యోతి

**ముస్తాబాద్ అక్టోబర్ 15 (జనం సాక్షి)**



ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామంలో శ్రీ దేవి యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం కుంకుమార్చన కార్యక్రమ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముస్తాబాద్ సబ్ ఇన్స్పెక్టర్ గిరుకు జ్యోతి హాజరవ్వడం జరిగింది వారితోపాటు గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ శ్రీ దేవి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఇట్టేడి భూపాల్ రెడ్డి చిగురు పాండరి అన్నదాన కార్యక్రమం నిర్వహించిన అన్నదాన దాత గొల్లపల్లి శ్రీనివాస్ తుమ్మ శ్రీను నాగరాజు పురుషోత్తం పరశురాములు పాల్గొన్నారు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది

# గన్నేరువరం రైతు వేదికలో మొక్కజొన్న విత్తనాల పంపిణీ

**గన్నేరువరం, అక్టోబర్ 15 (జనంసాక్షి):** గన్నేరువరం మండలకేంద్రం రైతు వేదికలో మొక్కజొన్న విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడటంతో రాష్ట్ర ప్రభుత్వం వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్న వేసుకోవాలని రైతులకు సూచించింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత మరియు పోషణ మిషన్ పథకం ద్వారా రైతులకు 70 శాతం సబ్సిడీతో మొక్కజొన్న విత్తనాలు, కలుపు మందులు,



క్రిమిసంహారక మందులు పంపిణీ చేస్తూ మొక్కజొన్న పంటను ప్రోత్సహిస్తోంది. ఈ కార్యక్రమంలో యాస్వాడ సర్పంచ్ కటకం తిరుపతి, ఖాసింపేట సర్పంచ్ కర్నే చంద్రయ్య, మాదాపూర్ సర్పంచ్ మాదరి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి జె. కిరణ్మయి, ఏఈఓలు వంశీకృష్ణారెడ్డి, వంశీధర్, సాయికుమార్, అంజలి, రైతులు పాల్గొన్నారు.

## ప్రకృతి ఒడిలో బతుకమ్మ సందడి - పోచారం ప్రాజెక్టుపై పూల బతుకమ్మల తయారీలో చిన్నారులు

### పోచారం ప్రాజెక్టు గట్టుపై బతుకమ్మల తయారీలో చిన్నారులు - ఆకట్టుకుంటున్న దృశ్యం



**జనం సాక్షి ఎల్లారెడ్డి అక్టోబర్ 15:**
నాగిరెడ్డిపేట / పోచారం:తెలంగాణ ఆడపడుచుల సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సందర్భంగా కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం పోచారం ప్రాజెక్టు వద్ద ఆహ్లాదకర దృశ్యం కనిపించింది. పోచారం ప్రాజెక్టు పరిధిలోని పోచమ్మరల్ గ్రామానికి చెందిన చిన్నారులు, యువతులు ఈరోజు తెల్లవారుజామున పోచారం ప్రాజెక్టు పైన, ప్రాజెక్టు చుట్టుపక్కల ఉన్న పూలను సేకరించి ప్రకృతి ఒడిలో, ప్రాజెక్టు గట్టుపైనే బతుకమ్మలను తయారు చేస్తూ కనిపించారు. పసుపు రంగు తంగేడు పూలతో బతుకమ్మలను పేర్చుతూ, నవ్వుతూ ఆడుతూ వారి ఆనందాన్ని పంచుకున్నారు. ఆ ప్రకృతి అందాల మధ్య, ప్రాజెక్టు నీటి అంచున చిన్నారులు బతుకమ్మలు తయారు చేస్తున్న దృశ్యం అటువైపు వాకింగ్ కు వెళ్లిన మీా 24 న్యూస్ ప్రతినిధి దృష్టిని ఆకర్షించింది.ప్రకృతితో మమేకమై తెలంగాణ సంస్కృతిని చాటుతున్న ఈ చిన్నారుల ఉత్సాహం అందరినీ ఆకట్టుకుంటోంది.





## రోడ్డు ప్రమాదంలో యువకుడు కి తీవ్ర గాయాలు

**గాంధారి జనం సాక్షి అక్టోబర్ 15**
గాంధారి మండలంలోని శ్రీకృష్ణ ధాబా సమీపంలో బాన్సువాడ కామారెడ్డి రహదారిపై బొలెరో వాహనం టైరు బైకును ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం గాంధారి మండలం లోని పొతంగల్ కలాన్ కు చెందిన వడ్ల అరుణ్ కామారెడ్డి నుండి గాంధారి కి చేరుకునే సమయంలో అతనికి ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం అధిక లోడుతో ఉంది వాహనం యొక్క వెనుక టైరు ఊడిపోయి బైక్ పై వస్తున్న వడ్ల అరుణ్ కు తగలగా వెంటనే బైక్ నుండి కింద పడి కుడికాలు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్ కి ఫోన్ చేయగా అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది వైద్యాధికారి కాశిరెడ్డి సూచనల మీదకు ప్రధమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి వెంటనే బాధితున్ని ఆసుపత్రికి తీసుకెళ్ళిన అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి కమలాకర్ పైలట్ ప్రకాష్ గౌడ్ లు ఉన్నారు.



## భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి పూజలు.. భక్తులకు అన్నదానం

సిరికొండ, అక్టోబర్ 15 జనం సాక్షి:
సిరికొండ మండలంలోని పెద్ద వాల్గోట్ గ్రామంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు అంజి గణేష్ మండలి ఆధ్వర్యంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, హోమం, కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు.పురోహితులు కులకర్ణి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ పూజా కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా సాగాయి. అమ్మవారికి అభిషేకం నిర్వహించి, హోమంలో పాల్గొన్న భక్తులు గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని కొలిచారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా అంజి గణేష్ మండలి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మహిళలు, భక్తులు, మండలి సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తి భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సత్యశోధక్ విద్యార్థుల ఎంపిక

సిరికొండ, అక్టోబర్ 15 జనం సాక్షి:
హనుమకొండలో ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-13 మినీ సబ్-జూనియర్ అంతర్‌జిల్లా సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2026?27 బాలుర విభాగంలో పాల్గొనేందుకు ఆర్. నరేంద్ర, జి. శరత్ చంద్ర, కె. సాయి సృజన్, టి. రిశ్విక్, బి. శ్రీరామ్ అర్హత సాధించారు.హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఎల్‌బీ కాలేజీ క్రీడా ప్రాంగణంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈనెల 4న జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాస్ఫూర్తితో ఆడి, ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగమోహన్ సైతం ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, తమ ప్రతిభతో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు అనికేత్, విద్యార్థులు పాల్గొన్నారు.






## దేవి హోమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15(జనం సాక్షి)**
శ్రీ సింహాసనేశ్వరి దుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన దేవి హోమం కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ దేవి హోమ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అమ్మవారిని దర్శించుకుని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. కామారెడ్డి పట్టణం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని కోరుకున్నారు.ఈ సందర్భంగా ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ, శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో దైవభక్తిని పెంపొందించడంతో పాటు ఐక్యతా భావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సుధీర్ రెడ్డి దంపతులు, కృష్ణారెడ్డి దంపతులు, శ్రీ సింహాసనేశ్వరి దుర్గా ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జెండాలను ఆవిష్కరించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్

**కామారెడ్డి అక్టోబర్ 15 (జనం సాక్షి)**
కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాలైన అజామాబాద్, వెంకటాపూర్, వెళ్ళుట్ల, వెళ్ళుట్లపేట గ్రామాల్లో నిర్వహించిన కాంగ్రెస్ జెండా పండుగ కార్యక్రమాల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొని కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, ప్రజా సంక్షేమ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## మైనర్ బాలికపై లైంగిక దాడి

### నిందితుడికి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష..
### ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు సంచలన తీర్పు..

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 జనంసాక్షి:
మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి ఇరవై సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధించడం జరిగింది. నిజామాబాద్ రూరల్ పోక్సో ఇన్‌ఛార్జ్ న్యాయమూర్తి దుర్గాప్రసాద్ గురువారం ఈ మేరకు సంచలన తీర్పు వెల్లడించారు.నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021 మార్చి 18వ తేదీన తమ గల్లీకి చెందిన ఒక వ్యక్తి మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి, సమగ్ర విచారణ చేపట్టారు. బాలిక మాత్ర విసర్జనకు వెళ్లిన సమయంలో ఒంటరిగా ఉన్న నిందితుడు ఆమెపై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.దాడి అనంతరం బాలిక కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. జరిగిన విషయాన్ని బాలిక తన తల్లికి తెలపడంతో, వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసుకు సంబంధించి సమగ్ర సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 5,000 జరిమానా విధిస్తూ తుది తీర్పు వెలువరించారు. పోలీసుల తరఫున అదనపు పీపీ నర్సింహారెడ్డి వాదనలు వినిపించారు.

# నీరుకుళ్ల గ్రామ పంచాయతీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**- పర్యావరణహిత బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులు అందజేత**

**- పర్యావరణాన్ని కాపాడుదాం,ప్రకృతి సిద్ధమైన బతుకమ్మలను ఏర్పాటు చేద్దాం**

**- సర్పంచ్ కాంపల్లి సతీష్ కుమార్**



**సుల్తానాబాద్,అక్టోబర్ 15(జనంసాక్షి) :** బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మండలంలోని నీరుకుళ్ల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను సర్పంచ్ కాంపల్లి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ కాంపెల్లి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను అందంగా అలంకరించి, ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డి ఎల్ పి ఓ, దేవకి దేవి, ఎం పి ఓ,మౌనిక హాజరై బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ప్లాస్టిక్ వినియోగం లేకుండా,కృత్రిమ రంగులు రసాయన పదార్థాలకు దూరంగా సహజసిద్ధమైన పూలతో రూపొందించిన బతుకమ్మలను ప్రత్యేకంగా పరిశీలించి, ఉత్తమంగా నిలిచిన మూడు బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను మహిళలకు యువతులకు,అందజేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అందించారు.బతుకమ్మ వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించడం పట్ల నీరుకుళ్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళలు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కాంపెల్లి సతీష్ కుమార్ మాట్లాడుతూ,బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, మహిళల ఐక్యతకు, ప్రకృతి పట్ల మనకున్న ప్రేమకు నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామంలో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని తెలిపారు.నీరుకుళ్ల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకలు గ్రామ ప్రజల ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిశాయి.

# కూలి డబ్బుల కోసం హత్య

**24 గంటల్లోనే హంతకులను పట్టుకున్నాం**

**సీఐ తో పాటు ఎల్లారెడ్డిపేట ఎస్ఐ, వీర్నపల్లి ఎస్ఐలకు రివార్డు ఇచ్చేందుకు ఎస్పికి సిఫారపు**

**అద్దెకుంటున్న పొరుగు రాష్ట్రాల వారి ఆధార్ కార్డులను వివరాలను ఓనర్లు దగ్గరగా ఉంచుకోవాలి**

**అనుమానం వచ్చిన వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలి:డీఎస్పీ నాగేంద్ర చారి**



**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 15, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గొల్లపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న ఉత్తర ప్రదేశ్కు చెందిన పవన్ సింగ్ బుధవారం హత్యకు గురైనట్లు సిఐ, ఎల్లారెడ్డిపేట ఎస్ఐ, వీర్నపల్లి ఎస్ఐలు తెలిపారు. కూలి డబ్బుల కోసం హత్య జరిగిందన్నారు. హత్య జరిగిన 24 గంటల లోపే హంతకులను అరెస్టు చేసి గురువారం మీడియా ముందుకు తీసుకువచ్చారు. అద్దెకుంటున్న పొరుగు రాష్ట్రాల వారి ఆధార్ కార్డులను, వివరాలను ఓనర్లు దగ్గరగా ఉంచుకోవాలు తెలిపారు. అనుమానం వచ్చిన వారి వివరాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా హత్యకు గల కారణాలను డిఎస్పీ నాగేంద్ర చారి వెల్లడించారు.

# బీబీపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

**దొంగతనాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి..**

**పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి**



**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (జనంసాక్షి)** కామారెడ్డి జిల్లా బీబీపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన రోల్‌కాల్ వివరాలు, సిబ్బందికి కేటాయించిన విధులు, బాధ్యతలు, పనితీరుపై సమీక్షించారు. పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

**గ్రామాల్లో దొంగతనాల నివారణకు ప్రత్యేక నిఘా**

పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో దొంగతనాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో నిరంతర గస్తీ నిర్వహించాలని, రౌడీషీటర్లు, పాత నేరస్థులు, అనుమానిత వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ ప్రజలకు భద్రతపై భరోసా కల్పించాలని పేర్కొన్నారు.

**సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి**

ప్రస్తుతం పెరుగుతున్న ఆర్థిక, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, అనుమానాస్పద లింకులు, ఓటీపీ మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. డయల్ 112 ద్వారా అందే అత్యవసర కాల్స్‌పై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర సహాయం అందించాలని ఆదేశించారు.

**పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం**

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరిధిలో సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని ఎస్పీ సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులను గుర్తించి అరెస్టు చేయడంతో పాటు దొంగిలించబడిన ఆస్తిని స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేసు దర్యాప్తులో నాణ్యత పాటిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు పనిచేయాలని, శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీలో బీబీపేట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ నవీన్ చంద్రతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బాధిత జర్నలిస్ట్ లకు న్యాయం చెయ్యండి

**సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి**



**జనం సాక్షి అక్టోబర్ రాయికల్ :** రాయికల్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం యందు ఆర్ ఐ పద్మయ్య ప్రెస్ క్లబ్ ఖిజాక్ రి ఆధ్వర్యంలో బాధిత జర్నలిస్టులకు న్యాయం చెయ్యాలని వినతి పత్రం అందించారు. ఇట్టి సందర్భంగా అధ్యక్షులు చింతకుంట సాయికుమార్ ,ప్రధాన కార్యదర్శి సింగిడి శంకరయ్య కోశాధికారి కడకుంట్ల జగదీశ్వర్ లు మాట్లాడుతు... గంభీరావుపేట లో విరుద్ధ వార్త కథనాలు ప్రచురించరంటూ జర్నలిస్టులు శేఖర్, సంపత్‌లపై గంబీరావు పెట్ పోలీస్ అధికారి థర్డు డిగ్రీ ప్రయోగించారనే వార్త లు వెలువడుతున్న సందర్భంలో ప్రస్తుతం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్రిటికల్ కేర్‌లో ఉన్న వీరు సరిగా పడుకోలేక.. కూర్చోలేక పడుతున్న అవస్థలు పడుతున్నారు తెలిసింది వార్తలు వ్రాస్తే ఇలా కక్ష్య పూరితంగా దాడిచేయడం సరికాదని,ఇట్టి అంశంపై నిజానిర్ధారణ చేసి జర్నలిస్ట్ లకు రక్షణగా నిలిచే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి నిజ నిజాలు నిగ్గు తేల్చాలని బాధితులకు న్యాయం చెయ్యాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్ ,జర్నలిస్టులు గంగదారి సురేష్ ,వాసం లింబాద్రి ఇమ్మడి విజయ్ కుమార్ ,మాలావత్ వెంకటేష్ మహమ్మద్ షాకీర్ దుగ్యాల రామాపతి రావు ,కొండ కళ్యాణ్ ,మహేష్ ,ఇర్పాన్ గట్టుపల్లి నరేష్ తదితరులు పాల్గోన్నారు.

# ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



**కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 15 (జనంసాక్షి)** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును పొందాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గురువారం రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామంలోని 160వ పోలింగ్ కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరంలో జరుగుతున్న నమోదు ప్రక్రియను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారు, అర్హత ఉన్నప్పటికీ ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు ఈ ప్రత్యేక శిబిరాలను వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితాలో తమ పేర్లు సక్రమంగా నమోదయ్యాయో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని సూచించారు.

పేర్లలో తప్పులు ఉన్నా, ఇతర మార్పులు లేదా చేర్పులు అవసరమైనా సంబంధిత అధి కారులను సంప్రదించి సరిచేసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదే శించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీ గా నిర్వహిస్తూ, అర్హులైన వారు ఎవరూ ఓటరుగా నమోదు కాకుండా మిగిలిపోకుండా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, మండల ప్రత్యేక అధికారి అపర్ణ, హార్టికల్చర్ అధికారి జ్యోతి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సూర్యజి, డివిజన్ పంచాయతీ అధికారి శ్రీనివాస్, సర్పంచులు సంధ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.